సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023





చింతపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూలును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. అదే స్కూల్లో మొక్కను నాటుతున్న సీఎం

గిరిసీమల్లో విద్యా సుమాలు పూయించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన విద్యార్థులకు రెండో విడత ట్యాబులు అందించి దీవించారు. మీ భవితకు నాదీ పూచీ అంటూ భరోసానిచ్చారు. భావిపౌరుల బంగారు భవితవ్యాన్ని ఆకాంక్షించి తన పుట్టిన రోజున జన శ్రేయస్సు కోసమే తపించిన ఆయనకు గిరిజనం అడుగడుగునా నీరాజనం పట్టారు. మళ్లీ మీరే సీఎం కావాలంటూ నినదించారు.

# చదువుల చందమామ



ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా విద్యార్థినులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- విద్యా విప్లవాన్ని తీసుకొచ్చిన సీఎంకు నీరాజనం
- గిరిజన విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- వారి మధ్య జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- మీ భవితకు నాదీ పూచీ అంటూ అక్కచెల్లెమ్మలకు భరోసా



యాలకుల మాలతో సత్కారం



సీఎం జగన్‌కు కేక్ తినిపిస్తున్న విద్యార్థినులు

సాక్షి, విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూల్లో విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ట్యాబ్ పంపిణీ, 'నాడు – నేడు'లో భాగంగా రెండో విడత ఐఎఫ్ బీ ప్యానళ్లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన దిగ్విజయంగా సాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత చింతపల్లి ప్రాంతానికి సీఎం తొలిసారిగా విచ్చేశారు. అదీ ఆయన పుట్టినరోజున ఇక్కడకు విచ్చేసి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఉప్పొంగిపోయారు.

**అడుగడుగునా నీరాజనం**

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు నీరాజనం పట్టారు. విద్యార్థులంతా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, నాడు–నేడు పథకంలో జరిగిన అభివృద్ధి, విద్యార్థులకు అందించిన సంక్షేమ పథకాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు.

**పోటీ ప్రపంచంలో రాణించాలి: సీఎం జగన్**

**పోటీ ప్రపంచంలో ఏపీ విద్యార్థులు రాణించాలని, తమ ప్రభుత్వంలో 55 నెలల పాలనలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి వైఎస్** జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సభావేదికపై ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మనం వాటిని అందిపుచ్చుకుని రెట్టింపు అప్‌డేట్ అవుతూ..రాణించాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అతి త్వరలో 'ఫ్యూచర్ స్కిల్స్' ఐటీ స్కిల్స్ తీసుకొస్తున్నామని తెలిపారు. మన ప్రభుత్వంలో విద్యారంగాన్ని పటిష్టం చేయడంతో ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం పోటీ పడుతున్నాయన్నారు. ఆయన మాట్లాడినంత సేపు విద్యార్థులు కేరింతలతో.. జగన్ మామ అని..ప్రజలు జై జగనన్న అని నినాదాలు చేశారు.

**పాడేరు నియోజకవర్గానికి వరాల జల్లు..**

పాడేరు నియోజకవర్గంలో చింతపల్లి మండలం పరిధిలో రెండు బ్రిడ్జిలు, ఆరు బీటీ రోడ్ల నిర్మాణ చేపట్టాలని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి పాడేరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారు. యుద్ధ ప్రాతిపదికన వాటికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**గిరిజన విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు**

చింతపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూల్ గిరిజన విద్యార్థుల మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎం కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. విద్యార్థులు అందరూ 'హ్యాపీ బర్త్ డే జగన్ మామయ్య' అంటూ సీఎంకు కేక్ తినిపించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

బహిరంగ సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు, గిరి రైతుల సాగు విధానాలను నృత్య రూపకాలతో వివరిస్తూ విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు పుష్ప శ్రీవాణి, పెట్ల ఉమా శంకర్ గణేష్, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు ఫరూఖీ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ముఖ్య నాయకులు శివ ప్రసాద్, శోభా హైమావతి పాల్గొన్నారు.

**ప్రజాప్రతినిధులు, నేతలతో ముఖాముఖి**

పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. వారందరితోను సీఎం మాట్లాడారు. వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు.



ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## గిరిజనుల పక్షపాతి సీఎం జగన్

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు నడియాడిన గిరిజన ప్రాంతాన్ని ఆయన పేరుతో ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమానికి విశేష కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. చింతపల్లి సభలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు బాక్సైట్ తవ్వకాల జీవో 97ను తీసుకువస్తే జగనన్న ఆనాడు గిరిజనుల పక్షాన నిలిచి బాక్సైట్‌కు వ్యతిరేకంగా పోరాడారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ జీవోలన్నింటిని రద్దు చేసి గిరిజనుల పక్షపాతిగా నిలిచారన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ అటవీ హక్కుల చట్టాన్ని తీసుకువస్తే, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాడేరు ప్రాంతంలోనే లక్షా 13వేల మంది గిరిజనులకు 2లక్షల 27వేల ఎకరాల అటవీ భూములకు పట్టాలిచ్చారన్నారు. పాడేరులో రూ.500కోట్లతో వైద్య కళాశాల, చింతపల్లిలో వంద పడకలను మంజూరు చేశారు. వాటి నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వడంతో గిరిజన ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. గిరిజన విద్యార్థులకు ఆంగ్లంతోపాటు డిజిటల్ విద్యను అందిస్తున్నారన్నారు. 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని చింతపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులపై ఉన్న అపారమైన ప్రేమ అభిమానాలను చాటుకున్నారన్నారు. గిరిజన ప్రాంత ప్రజల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం పర్యటన సాగిందిలా..

అల్లూరి జిల్లా చింతపల్లిలో నిర్వహించే ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.18 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికి..జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడపల్లి గ్రామంలో హెలిప్యాడ్ వద్దకు 11.20 గంటలకు చేరుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

- అక్కడ నుంచి 11.40 గంటలకు జీటీడబ్ల్యూఎహెచ్ స్కూల్లో 15 నిమిషాల పాటు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అక్కడ నుంచి 12.03 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదికకు చేరుకున్నారు. అక్కడ పది నిమిషాల పాటు ట్యాబ్ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.
- సభావేదిక వద్ద ప్రసంగం అనంతరం 1.41కు అక్కడ నుంచి చౌడపల్లిలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఐటీడీఏ పీవో పరిధిలో పలువురు నుంచి సీఎం గ్రీవెన్స్ తీసుకున్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలను, నాయకులకు ఆత్మీయంగా పలకరించారు. సాయంత్రం 3.15 గంటలకు తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సాయంత్రం 4.05 గంటలకు తిరిగి విమాన మార్గంలో విజయవాడ వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఉన్నారు.

# గిరి విద్యార్థులతో మమేకమై..

- తరగతి గదిలో కూర్చొని డిజిటల్ పాఠం ఆలకించిన సీఎం జగన్
- సెల్ఫీలు దిగిన విద్యార్థులు



తరగతి గదిలో డిజిటల్ బోధనను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



డిజిటల్ బోధనపై విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్

చింతపల్లి రూరల్: గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మమేకమయ్యారు. హెలిప్యాడ్‌నుంచి ఆయన నేరుగా పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు బోధించే పాఠాన్ని విన్నారు. విద్యార్థులు ఏ మేర అర్థం చేసుకుంటున్నారో పరిశీలించారు. పాఠశాలలో నాడు–నేడులో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌బీ, గ్రీన్ బోర్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధన విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కోరిన మేరకు వారితో సెల్ఫీ దిగారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గత ఏడాది అందించిన ట్యాబ్‌లను ఎంతవరకు వినియోగిస్తున్నారో, ఏమేర వారికి ఉపయోగపడుతుందో తెలుసుకున్నారు. నాడు–నేడు పథకంలో ఏర్పాటుచేసిన ప్లాంట్‌ను పరిశీలించి, ఆ నీటిని తాగారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రామరాజుపడాల్, ఉపాధ్యాయులు ప్రసాదరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సెల్ఫీ తీసుకుంటున్న గిరిజన విద్యార్థి కె.శివశంకర్

## న్యూస్‌రీల్

### చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'నాక్' గుర్తింపు



చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అక్రిడిటేషన్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు లభించింది. కమిటీ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ ప్రకటిస్తూ, ఆ ఉత్తర్వులను ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణకు గురువారం అందించింది. ఈ నెల 12, 13 తేదీల్లో నాక్ కమిటీ సభ్యులు కళాశాలను సందర్శించి, నాక్ గుర్తింపునకు గల అవకాశాలు, అర్హతలను పరిశీలించిన సంగతి విదితమే.. కళాశాల బీ ప్లస్ గ్రేడ్ పొందేందుకు కృషి చేసిన ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్, నాక్ కో–ఆర్డినేటర్ పి.కిరణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. అధ్యాపకులకు, కళాశాల విద్యార్థి సంఘాలకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నాక్ గుర్తింపు సాధించడంపై ఉపన్యాసకులు ఎస్.ఎం.రఫీయుద్దీన్, హెచ్.సుధీర్, ఐవివి సత్యవతి, అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### స్వయం ప్రతిపత్తి సంస్థల ఏర్పాటుకు సంస్కరణలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీధర్

అనకాపల్లి: స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంస్కరణలు తీసుకొచ్చాయని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.శ్రీధర్ అన్నారు. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో గురువారం మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థి స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు, నిధులు ఏవిధంగా సమకూర్చాలనే అంశాలపై విద్యార్థులకు సూచించారు. నూతనంగా సంస్థలను ప్రారంభించే సమయంలో ఎవరి నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోవాలనే అంశాలపై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ కోరబిల్లి రమేష్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివప్రసాద్, అధికారులు కేఎస్ఎన్.ప్రకాశరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు కె.రాజేష్, కె.భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్సై సెలక్షన్స్‌లో సత్తా చాటిన గృహిణి

వడ్డాది మహిళకు రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంక్



ప్రమీలాదేవి

బుచ్చెయ్యపేట: ఎస్సై మెయిన్ పరీక్షల్లో బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన కొండపల్లి ప్రమీలాదేవి ఓపెన్ కేటగిరిలో 16వ ర్యాంక్ సాధించారు. గృహిణిగానే కాకుండా ఇద్దరు పిల్లల తల్లిగా నిత్యం పనులతో హడివుడిగా ఉండే ఆమె ఈ ఘనత సాధించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఆమెకు సచివాలయ పోలీస్ ఉద్యోగం వచ్చిన విధుల్లో చేరకుండా ఎస్సై అవ్వాలన్న ధృడ సంకల్పంతో చదివారు.

తాను అనుకున్నట్లే ఇటీవల జరిగిన మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఓపెన్ కేటగిరిలో 16వ ర్యాంక్, మహిళా విభాగంలో 5వ ర్యాంక్ సాధించారు. భర్త సత్తిబాబు ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగానని ఆమె సాక్షితో మాట్లాడుతూ చెప్పారు.

### బుల్లెట్ ఎక్కిన ప్రవీణ్ ప్రకాష్

నర్సీపట్నం: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బుల్లెట్‌పై ప్రయాణించారు. అల్లూరి జిల్లా చింతపల్లిలో బుధవారం ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొని తిరిగి నర్సీపట్నం వస్తూ సరదాగా బుల్లెట్ ఎక్కారు. తనతో వచ్చిన సిబ్బందిని తన వాహనంలో ముందు పంపించేశారు.

ఏజెన్సీలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు చింతపల్లి నుంచి బుల్లెట్‌పై బయలుదేరారు. చింతపల్లి నుంచి నర్సీపట్నం సమీపంలో ఉన్న డౌనూరు వరకు ఘాట్‌రోడ్డులో సుమారు 25 కిలోమీటర్లు ప్రయాణించారు. డౌనూరుతో ఘాట్ రోడ్డు ముగియడంతో అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రవీణ్ ప్రకాష్ నర్సీపట్నం చేరుకున్నారు.

## జనవరిలో టిడ్కో గృహాలకు ప్రారంభోత్సవం

టిడ్కో రాష్ట్ర చైర్మన్ ప్రసన్నకుమార్



అధికారులకు సూచనలు చేస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్

నర్సీపట్నం: జనవరిలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయాలని టిడ్కో రాష్ట్ర చైర్మన్ జె.ప్రసన్నకుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరగా అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను ఇటీవల స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. ఈ నేపథ్యంలో చైర్మన్ స్వయంగా అధికారులతో టిడ్కో గృహాలను పరిశీలించారు. జనవరి నాటికి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఏపీ టిడ్కో ఎస్ఈ, ఈఈ, డిప్యూటీ ఈఈ, మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

## ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు



మహాలక్ష్మీ సమేత వైకుంఠనారాయణస్వామి

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 అడుగుల దివ్యమంగళ స్వరూపుడైన మహాలక్ష్మీ సమేత వైకుంఠ నారాయణస్వామిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అదేరోజు ఆలయ ఆవరణలో దీర్ఘసుమంగళీభవలో భాగంగా పసుపుకుంకుమ, రవిక అందిస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



ఎ.కోడూరులో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ట్యాబ్‌లతో విద్యార్థులు.. చిత్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, మందపాటి సునీత, విద్యాశాఖ అధికారులు

# విద్యా విప్లవం

- జిల్లా అంతటా బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ ప్రారంభం
- శ్రీకారం చుట్టిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి/కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జిల్లా అంతటా గురువారం ప్రారంభమైంది. కె.కోటపాడు మండలం ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి జీవీఎంసీ పెద్దహైస్కూల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 15201 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నామని తెలిపారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో విద్యా ప్రమాణాల మెరుగుదలకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ముందుగా చిన్నారులతో కలిసి సీఎం జగన్ జన్మదిన కేక్‌ను ముత్యాలనాయుడు కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, తర్రా శేషు, గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు. అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని, డిజిటల్ విద్య ద్వారా విద్యార్థులు రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. గత ఏడాది 8వ తరగతి విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌లు పొందారని, కొత్తగా ట్యాబ్‌లు అందుకుంటున్న విద్యార్థులు సీనియర్ల సహాయంతో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, మందపాటి సునీత మాట్లాడారు. ఏడీ ఆడారి రవికుమార్, డిప్యూటీ డీఈవోలు సుజాత, అప్పారావు, ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన సేవాభావం

- జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు
- అన్నదానం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు
- అనాథ చిన్నారులకు దుస్తుల వితరణ
- రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ


చోడవరం: అడ్డూరులో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న విప్ ధర్మశ్రీ


నర్సీపట్నంలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్


దేవరాపల్లి: వైస్ ఎంపీపీ బుల్లిలక్ష్మికి కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

సాక్షి, అనకాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సేవా భావం వెల్లివిరిసింది. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా 55 నెలలు పరిపాలన సాగించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతగా పార్టీ శ్రేణులు, యువత, అభిమానులు రక్తదానం చేశారు. వాటితో పాటుగా దివ్యాంగులకు వీల్‌చైర్లు, వృద్ధులకు పండ్లు, రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఇలా లెక్కకు మిక్కిలి సేవా కార్యక్రమాల్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. పలుచోట్ల సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు.

- పాయకరావుపేట నియోజకవర్గంలో పాయకరావుపేట టౌన్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహం వద్ద వెయ్యి మంది పేదలకు దుప్పట్లు పంపిణీ, 2,500 మందికి అన్నదానం చేశారు. పాయకరావుపేటలో ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వాలీబాల్, కబడ్డీ, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్. రాయవరంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, ఎంపీపీ లోవకుమారి, జెడ్పీటీసీ కాకర దేవి రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కేక్ కట్ చేసి, ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.
- అనకాపల్లి నియోజకవర్గంలో టౌన్ రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేశారు. ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గోపాలపురంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు.
- చోడవరం నియోజకవర్గంలో టౌన్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి.. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. బుచ్చెయ్యపేట, రావికమతం, తదితర మండలాల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.
- మాడుగుల నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో దేవరాపల్లి మండలం తారువలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కె.కోటపాడులో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. మాడుగులలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం వృద్ధాశ్రమంలో బియ్యం, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో టౌన్‌లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు.
- యలమంచిలి నియోజకవర్గంలో మునగపాకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో వెయ్యి మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. అచ్యుతాపురం పార్టీ కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. యలమంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని సుకుమారవర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ప్రారంభించారు.


పాయకరావుపేటలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిక్కాల రామారావు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్

# సీఎం జగన్‌కు ఘన స్వాగతం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో పర్యటన నిమిత్తం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. గురువారం ఉదయం 10.18 గంటలకు విమానంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గొల్ల బాబూరావు, యు.వి.రమణమూర్తిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ ఆనంద్ రెడ్డి, సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం 10.38 గంటలకు సీఎం జగన్ ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో చింతపల్లి బయలుదేరారు. అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి సాయంత్రం 4.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సీఎం జగన్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

## శరవేగంగా తాచేరు వంతెన డైవర్షన్ రోడ్డు పనులు


పొక్లెయిన్‌తో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో తాచేరు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం ఈ వంతెన కూలిపోగా అనకాపల్లి, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు చేస్తున్నారు. ఈ పనులను గురువారం సాయంత్రం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. 20 నుంచి 30 టన్నుల చెరకు లోడ్ లారీలు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలించాల్సి ఉండటంతో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు.



# యువగళం ముగింపు సభ అట్టర్ ఫ్లాప్

- దాన్ని జీర్ణించుకోలేక కారుకూతలు
- టీడీపీ నేతలపై రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం ధ్వజం

నక్కపల్లి: రాష్ట్రంలో పప్పునాయడు లోకేష్ నిర్వహించిన పాదయాత్ర, యువగళం ముగింపు సభ అట్టర్ ఫ్లాప్ కావడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు, మాజీ మంత్రులు జగనన్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ విమర్శించారు. గురువారం ఆయన నక్కపల్లిలో మాట్లాడుతూ యువగళం ముగింపు సభకు టీడీపీ నాయకులు ఆశించిన స్థాయిలో జనం రాలేదన్నారు. పది లక్షల మంది వస్తారని డబ్బా కొట్టుకుంటే తీరా లక్ష మందీ రాలేదని ఎద్దేవా చేశారు. దీన్ని జీర్ణించుకోలేక ప్రజల దృష్టిని మరల్చి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం జగనన్న సర్కారుపై విమర్శలు చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే టీడీపీ ఇప్పుడు వెంటిలేషన్‌పై ఉందని, దానికి పవన్ కల్యాణ్ ఆక్సిజన్‌లా ఉపయోగపడుతున్నారన్నారు. పవన్‌కల్యాణ్ ఇంటికెళ్లి బతిమాలి యువగళం ముగింపు సభకు తీసుకొచ్చిన దుస్థితికి దిగజారిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గంజాయి డాన్, టీడీపీలో తాగుబోతు కమెడియన్ అయ్యన్నపాత్రుడు కూడా సీఎంను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదు పర్యాయాలు మంత్రిగా పనిచేశానని చెప్పుకునే అయ్యన్న ఉమ్మడి జిల్లాకుగానీ నర్సీపట్నం నియోజకవర్గానికిగానీ ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారన్నారు. గిరిజనుల సాగు భూములకు హక్కు కల్పించిన ఘనత వైఎస్సార్‌ది, జగనన్నదేనన్నారు. జగన్ చరిష్మాతో గెలిచిన గిడ్డి ఈశ్వరి సైతం తమ సీఎంను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంచడాన్నీ టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాడగట్ల పాపారావు పాల్గొన్నారు.


నక్కపల్లిలో మాట్లాడుతున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ

## రూ.26 కోట్ల ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు

జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

నాతవరం: ఉమ్మడి జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.26 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని జెడ్పీ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి, విద్యుత్ పనులతోపాటు పలు భవనాల మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఆయా నిధులు మార్చి నెలాఖరులోపు ఖర్చు చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంతవరకు రూ.10 కోట్లతో పనులు చేశామని, వాటిలో రూ.5 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. విద్యుత్ బకాయి బిల్లులు వసూళ్లపై దృష్టి సారించామన్నారు. ఉమ్మడి జిల్లాలో 39 మండలాల్లో అన్ని రకాల ఖాళీ పోస్టులు దశల వారీగా భర్తీ చేస్తున్నామన్నారు. సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌ల నూతన భవన నిర్మాణాలు త్వరితగతిని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలు తీరు, భవనాల నిర్మాణాలపై ప్రత్యేకంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో మోనటరింగ్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. వారు నేరుగా మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, జెడ్పీ ఏవో రాజ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంటు కృష్ణ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, జూనియర్ అసిస్టెంటు లక్ష్మణరావు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనే లక్ష్యం

అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు


రోలుగుంట పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

రోలుగుంట: గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా తమ శాఖ పని చేస్తోందని అనకాపల్లి డీఎస్పీ బి.సుబ్బరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్ ఆవరణను పరిశీలించి సుందరంగా తయారు చేయాలని ఎస్సై ఎల్.సురేష్‌ను ఆదేశించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. రికార్డుల్లో పూర్తి స్థాయి సమాచారం ఉండాలని, వాటిని క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. ప్రధానంగా గంజాయి నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నమోదైన గంజాయి కేసులు, అరెస్టు అయిన వారు, పరారీలో ఉన్న వారి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాల్లో సాధ్యమైన మేర దాడులు చేస్తున్నామన్నారు. దీని నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న చర్యలకు స్థానికులు భాగస్వాములు కావాలని కోరారు. మాడుగుల, కోనాం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాటరాయళ్లపై తరచూ దాడులు చేసి కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.

# రెండు బైకులు పరస్పరం ఢీ

యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన రాము


మృతుడు రాము(ఫైల్)

మాకవరపాలెం: రెండు బైకులు ఢీకొట్టుకున్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని జడ్. గంగవరం గ్రామానికి చెందిన పారుపల్లి రాము(34) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో స్వగ్రామం నుంచి మాకవరపాలెం మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. దుంగలవానిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని దాటుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న బైక్, రాము వెళుతున్న బైక్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వెళ్తున్న కాకినాడ జిల్లా తొండంగి మండలం కొత్తపేటకు చెందిన కుక్కాన రాజు(21) గాయపడ్డాడు. ఇతడిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్ఐ రామకృష్ణారావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాము మృతితో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

# అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు బుచ్చెయ్యపేటలో సమ్మె చేస్తున్నారు. గురువారం ఇక్కడ శిబిరం వద్దకు ఆయన వెళ్లి వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. మండల అంగన్‌వాడీ సంఘ సభ్యులు వరలక్ష్మి, అమ్మాజీ, రాధ తదితరులు జీతాలు పెంచాలని, అలవెన్స్, తదితర డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీకి వివరించారు.

# పీఏసీఎస్ ఆధ్వర్యంలో బంక్ నిర్మాణం


ఎ.కోడూరులో బంక్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

భూమి పూజతో శ్రీకారం

కె.కోటపాడు: పీఏసీఎస్‌ల ద్వారా రైతాంగానికి మేలు చేస్తూ వ్యాపారాభివృద్ధితో సంఘాలను లాభాల బాటలో పయనించేలా చేయాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. డీసీసీబీ డైరక్టర్ చల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎ.కోడూరు గ్రామంలో హెచ్‌పీసీఎల్ బంక్ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.కోటపాడు పీఏసీఎస్ ద్వారా రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు ఇవ్వడంతోపాటు వ్యాపారాభివృద్ధితో పలు సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తుండడం ఆనందంగా ఉందని అన్నారు. హెచ్‌పీ బంక్ ఏర్పాటుతో పీఏసీఎస్‌కు మరింత ప్రతిష్ట పెరగనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్ నుంచి బీసీ కాలనీ వరకు రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ సందర్భంగా ప్రారంభించారు. బీసీ కాలనీవాసులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరపాలని కోరారు. వెంటనే రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ముత్యాలనాయుడు ప్రకటించారు. డీసీసీబీ సీఈవో డీవీఎస్.వర్మ, డీసీవో పి.ఎన్.కిరణ్ కుమారి, ఆప్కాబ్ ఏజీఎం జీవీఎస్ఎన్ మూర్తి, ఓఎస్డీ కె.శ్రీనివాసరావు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, చౌడువాడ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

## గ్రూప్-2 ఉచిత శిక్షణ దరఖాస్తుకు నేడు గడువు

ఎంవీపీ కాలనీ: స్థానిక సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు ప్రిలిమినరీ పరీక్షలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రూప్-2 శిక్షణ దరఖాస్తులకు శుక్రవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. అనంతరం వచ్చిన దరఖాస్తులను డిగ్రీలో వచ్చిన మార్కులు ఆధారంగా మెరిట్ నిర్ణయించి 40 మందిని ఎంపిక చేయనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. గ్రూప్-1 అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ వరకు గడువు ఉంది. ఈ శిక్షణకు 60 మందిని ఎంపిక చేయనున్నారు. పూర్తి వివరాలకు 0891-2564346, 9492569177 నంబర్లలో సంప్రదించవచ్చు.

# దాతల సహకారంతో ధనుర్మాస వాహన సేవలు

అనుమతిచ్చిన టీటీడీ


వివరాలు వెల్లడిస్తున్న ప్రధానార్చకుడు వరప్రసాదాచార్యులు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని దాతల సహకారంతో సేవలు నిర్వహించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అనుమతి మంజూరు చేసిందని ఉపమాక ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. స్వామివారి వాహన సేవల్లో భక్తులకు భాగస్వామ్యం కల్పించే ఉద్దేశంతో అనుమతులు వచ్చాయన్నారు. ఆర్థిక అంశాలను ముడిపెట్టి ఆలయంలో ధనుర్మాస సేవలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని వైస్ ఎంపీపీ వీసం నానాజీ బుధవారం తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించి న ఆయన సేవలు పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే రూ.1.20 లక్షలు విడుదల చేయాలని విజయవాడలో జోన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వెంకటయ్యకు ఆదేశాలు జారీ చేయగా.. ఏఈవో జగన్మోహనాచార్యులు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్వామివారి తిరువీధి సేవల్లో భక్తుల ఆర్థిక సాయంతో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామి వారి వాహన సేవలకు ఉపమాక గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు దంపతులు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు యలమంచిలికి చెందిన నాంచారయ్య విరాళం అందజేస్తానన్నారు. స్వామివారి తిరువీధి సేవల్లో పాల్గొనే భక్తులు ముందుగా దేవస్థానం అధికారులను సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించుకోవలసిందిగా ఆయన కోరారు. ఆఫీసు అసిస్టెంట్ గురవయ్య, సిబ్బంది శివుడు నాయక్ పాల్గొన్నారు.

## విశాఖలో ఇన్వెస్టర్స్ సర్వీస్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలోని సెక్యూరిటీస్ మార్కెట్ ఇన్వెస్టర్ల అవసరాలను తీర్చేందుకు సెబీతో పాటు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీలు కలిసి విశాఖ నగరంలో 'ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్'ని గురువారం ప్రారంభించాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించే ఈ సెంటర్‌ని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ మురళీధర్‌రావు, ఎన్ఎస్ఈ లిస్టింగ్ ఇన్వెస్టర్స్ కంప్లయిన్స్ చీఫ్ రెగ్యులేటరీ అధికారి అంకిత్ శర్మ, రీజనల్ రెగ్యులేటరీ సంతోష్ మోహన్ దాస్ ఆధ్వర్యంలో కార్యకలాపాల్ని ప్రారంభించారు. సెక్యూరిటీల మార్కెట్‌లో లిస్టెడ్ కార్పొరేట్ సంస్థలు, ఇతర నమోదిత మధ్యవర్తులకు సంబంధించిన పెట్టుబడిదారుల ఫిర్యాదుల పరిష్కారాన్ని ఈ సెంటర్ సులభతరం చేస్తుందని తెలిపారు.

## క్లుప్తంగా

### గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవపోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్

**అనకాపల్లి:** అమ్మవారి ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఉత్సవ కమిటీ సభ్యులకు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ సూచించారు. ఆలయ ఆవరణలో గురువారం అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 23న కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం ప్రతి ఏటా మాదిరిగానే ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు), కుంచా చిట్టిబాబు, కుంచా చిన్ను, కోటిపల్లి శ్రీను, పార్టీ నేతలు శిలపరశెట్టి బాబీ, మొల్లి రమణబాబు, విల్లూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

### రేపు గీతాజయంతి వేడుకలు

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం సంత సమీపంలోని అయోధ్యా లహరిలో గీతా జయంతి వేడుకలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు వంశీ జోగానంద జ్ఞాన ఆశ్రమం గురు చంద్రశేఖర్‌స్వామి తెలిపారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనం పోటీలు విద్యార్థులకు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఉపదేశ సార భగవద్గీత పుస్తకాల వితరణ, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతాయన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కశింకోట:** మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఏడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేయనున్న దృష్ట్యా తాళ్లపాలెం, బంగారయ్యపేట, గొబ్బూరు, చింతలపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. దీనిదృష్ట్యా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కశింకోట:** కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 1,365 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,500 | 5,190 |
| మొదటి రకం | 4,310 | 4,720 |
| రెండో రకం | 4,240 | 4,570 |
| మూడోరకం | 4,160 | 4,390 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| జోరుగా హుషారుగా | రాజా |
| ఎక్స్‌ట్రా | సత్యనారాయణస్క్రీన్-1 |
| ------- | సత్యనారాయణస్క్రీన్-2 |
| యానిమల్ | షిర్డిసాయి |
| హాయ్ నాన్న | పర్తిసాయి |
| మంగళవారం | వెంకటేశ్వర |
| తికమక తాండ | శ్రీసత్య |
| పిండం | రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 362 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.





లక్ష్మీదేవిపేటలో పేదమహిళకు దుప్పటి అందిస్తున్న రత్నాకర్



గురుకుల పాఠశాలలో విద్యార్థిని పరీక్షిస్తున్న కాంద్రేగులు విష్ణుమూర్తి



తారకరామాకాలనీలో నారపిన్ని ప్రసాద్ అధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకల్లో పార్టీ నేతలు



80వవార్డులో పేదలకు స్వెట్టర్లు అందిస్తున్న రత్నాకర్



మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో దిలీప్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

# జగనన్న జన్మదినం..ఊరూరా సంబరం

**అనకాపల్లి:** ప్రజల వద్దకే పాలన తీసుకొస్తూ రాష్ట్ర ప్రజల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక లక్ష్మీదేవిపేట జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు అధ్యక్షతన గురువారం సీఎం జగన్ జన్మదిన వేడుకలు జరిగిన వేడుకల్లో జన్మదిన కేక్ కట్ చేసి పార్టీ నేతలకు పంపిణీ చేశారు. 150 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత సంఘ నాయకులు రేబాక రామారావు, ఫాస్టర్ పంద్రాన తిమోతి, వైఎస్సార్‌సీపీ నేతలు ఏవీ.రత్నకుమారి, బుద్ధ పెంటారావు, ఈసరపు రమేష్, రేబాక ఇంద్రకుమార్, రేబాక విజయకృష్ణ పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ వైద్యాలయంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రోగులకు పండ్లు, రొట్టెలు, ఆస్పత్రి సిబ్బంది భోజనం క్యారియర్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అందజేశారు. 80, 81వవార్డుల్లో జరిగిన వేడుకల్లో పేదలకు దుప్పట్లు, ఆర్థికంగావెనుకబడిన వారికి స్వెట్టర్లు పంపిణీ చేశారు. జన్మదిన కేక్ కట్ చేసి పార్టీ నేతలకు పంపిణీ చేశారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమ వార్డు ఇన్‌చార్జిలు పీలా రాంబాబు, కొణతాల భాస్కరరావు, పార్టీ నేతలు, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర బీసీ సంఘ వ్యవస్థాపకులు మొల్లి రమణబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● పట్టణం, మండలంలో జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలల్లో సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలో గురుకుల పాఠశాలతోపాటు, పట్టణంలో నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలల్లో శ్రీవివేకానంద చారిటబుల్ ట్రస్టు అనుబంధ సంస్థ వైఎస్సార్ హెల్త్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు జరిగాయి. శిబిరాల్లో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు, వైద్యుడు కాంద్రేగుల విష్ణుమూర్తి విద్యార్థులను పరీక్షించారు. ఈ శిబిరాల్లో చెవి, ముక్కు, గొంతు సమస్యలపై వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ యువ నేత, వైద్యులు కె.యశ్వంత్, పాఠశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, వైఎస్సార్ హెల్త్ ఫౌండేషన్ సభ్యులు కాంద్రేగుల శ్రీను, ఈశ్వరరావు, నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మండలంలో అక్కిరెడ్డిపాలెం తారకరామాకాలనీలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంజిలిని రాజశేఖర్ గృహంలో సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్ ఆధ్వర్యంలో జన్మదిన కేక్ కట్ చేసి చిన్నారులకు, పార్టీ నేతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అక్కిరెడ్డి శ్రీను, పంతం శ్రీనివాసరావు, కణితి గణేష్, పెదపాటి సంతోష్‌కుమార్, అక్కిరెడ్డి సత్తిబాబు, సుంకర రాంబాబు, టి.రాజు పాల్గొన్నారు.

● మండలంలో గోపాలపురం గ్రామ సచివాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు జన్మదిన కేక్ కట్ చేసి పేదలకు బియ్యం, పలు రకాల పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మండలంలో ముత్రాసుకాలనీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన కేక్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహాసత్యవతి, కో ఆప్షన్ సభ్యులు పెతకంశెట్టి సత్యనారాయణ(జోసెఫ్)లు కట్ చేసి పంపిణీ చేశారు. అంతకుముందు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, అధికసంఖ్యలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

**కశింకోట:** మండలంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, ఉప సర్పంచ్ లక్కరాజు గోవింద, పార్టీ గ్రామ అధ్యక్షుడు గాలి శ్రీను, సీనియర్ నాయకుడు తులసీరావు, వార్డు సభ్యులు అప్పలరాజు, ఊసా కృష్ణ పాల్గొన్నారు. బాలికల వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బిస్కెట్లు, కూల్ డ్రింకులను పంపిణీ చేశారు. జోగారావుపేటలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. బాణసంచా కాల్చారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సోమునాయుడు, ఉప సర్పంచ్ వజ్రం శ్రీను, స్థానిక నాయకులు నూకరాజు, మాణిక్యం, చిరంజీవి, మారిశెట్టి జగన్ పాల్గొన్నారు.

**మంత్రి క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం**

**అనకాపల్లి:** రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులకు, అత్యవసరమైన ఆపరేషన్లకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. దాతల రక్తాన్ని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి అప్పగించారు. పార్టీ వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి, వైద్యుడు బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, కె.చంద్రశేఖర్‌లు రక్తదానం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ సూరిబాబు, పట్టణ మహిళావిభాగం అధ్యక్షురాలు రత్నకుమారి, పార్టీ నేతలు మునూరు శ్రీనివాసరావు, శోభ, గైపూర్ రాజు, ఉగ్గిన అప్పారావు, లక్ష్మి పలకా సత్యనారాయణ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పార్టీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు

**అనకాపల్లి :** స్థానిక రింగ్‌రోడ్డులో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ జన్మదిన కేక్ కట్ చేసి పార్టీ నేతలకు తినిపించారు. అంతకుముందు నిరుపేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు మందపాటి సునీత, ప్రసన్నలక్ష్మి, జిల్లా కార్యదర్శి రమేష్, కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు విష్ణుమూర్తి, దాడి నారాయణరావు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆస్పత్రి సిబ్బందికి లంచ్ క్యారియర్లు అందిస్తున్న రత్నాకర్



ముత్రాసుకాలనీలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సత్యవతి, పెతకంశెట్టి సత్యనారాయణ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు సునీత, ప్రసన్నలక్ష్మి, జానకీరామరాజు



ఉగ్గినపాలెంలో సీఎం జగన్ జన్మదిన కేకు కట్ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



రక్తదానం చేస్తున్న జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ

## రేపు ముక్కోటి ఏకాదశి వేడుకలు

**దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు**

**అనకాపల్లి :** స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23న ముక్కోటి ఏకాదశి వేడుకలు నేత్రపర్వంగా జరగనున్నట్లు ఆలయ చైర్మన్ సకలా గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి స్వామివారి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయని, ఈ ఉత్సవాలు వచ్చే ఏడాది జనవరి 14వతేదీ వరకు అంగరంగవైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఈనెల 16న శనివారం రాత్రి 12 గంటలకు ధనుర్‌సంక్రమణ ప్రవేశించడంతో నెలగంట కొనసాగుతోందని, స్వామివారికి తెల్లవారుజాము 4.30 నిమిషాలకు సుప్రభాతసేవ, సహస్రనామార్చన, బాలభోగం, వేదస్వస్తి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనాన్ని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

జనవరి 6వతేదీన స్వామివారి ఊంజల్‌సేవ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ జరిపేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జనవరి 14వ తేదీ భోగిపండగ రోజు సాయంత్రం గోదాదేవి కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరగనున్నాయి.

**గుట్టమీద వేంకటేశ్వరుడే..**

విజయనగరం సామ్రాజ్య సామంతరాజుకు 1350 సంవత్సరంలో స్వప్నంలో స్వామివారు కనిపించి తాను ఇక్కడ స్వయంభువుగా గుట్టలో ఉన్నట్లు చెప్పారు. అప్పుడు ఆరాజు ఈ ప్రాంతానికి వచ్చి గుట్టలు తవ్వి గుట్టలో స్వామిని కనుగున్నారు. దీంతో రాజు స్వామివారి స్వయంభూ తత్వాన్ని ఓ శిలాఫలకంపై చెక్కించి స్వామివారి ఎదుట ప్రతిష్టింప చేశారు. ఆ తర్వాత కాలంలో శిథిలమైంది. శిలాఫలకం స్థానంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం ఒకే పీఠంపై స్వామివారు అలమేలు మంగ భక్తులకు దర్శనమిస్తున్నారు.

## విద్యార్థినులకు ట్యాబ్‌ల అందజేత



కశింకోట బాలికల హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



నరసింగబిల్లి హైస్కూలులో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

**కశింకోట:** విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. కశింకోటలోని బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న 236 మంది విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని విద్యాభ్యాసం కొనసాగించడానికి సుమారు రూ.30 వేల విలువైన ట్యాబ్‌లను అందజేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం వంట పాత్రలను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ జ్యోతి, హెచ్‌ఎంలు స్వర్ణకుమారి, అప్పారావు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

**కశింకోట:** మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం సునీత, సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ సేనాపతి నాగలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా వెంకన్న పెళ్లిరాట

**కశింకోట :** కశింకోటలోని గవరపేటలో వెలసి ఉన్న వేంకటేశ్వరస్వామి పెండ్లి రాట ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం పెద్ద ఎత్తున జరగనుంది. ఈ నేపథ్యంలో ముందుగా సంప్రదాయంగా పెళ్లి రాట ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడు కొమ్మను తీసుకు వచ్చి దానికి పసుపు రాసి బొట్లు పెట్టి వేద మంత్రాల నడుమ నిలిపారు.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కశింకోటలోని గవరపేటలో వేంకటేశ్వరస్వామి పెళ్లి రాట వేస్తున్న భక్తులు

### 26 నుంచి ఆడుదాం... ఆంధ్రా క్రీడాపోటీలు

**అనకాపల్లి :** ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహరావు, ఎంఈవో-2 కె.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీఈటీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. క్రీడాకారులకు క్రీడా మైదానాలను పరిశుభ్రం చేయడమే కాకుండా, వారికి కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

### విపక్ష ఎంపీల సస్పెన్షన్‌లపై నిరసనగా నేడు ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి సంతోష్

**అనకాపల్లి :** బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి సంతోష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యాలపై కేంద్ర హోంశాఖ మంత్రి నుంచి సమాధానం రాబట్టేందుకు ప్రశ్నించిన కాంగ్రెస్, ఇండియా కూటమికి చెందిన 141 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌కు నిరసనగా స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధర్నాలో పార్టీ నేతలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు గంగాధర్, కాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల నిరసన

**కశింకోట :** కశింకోటలోని జాతీయ రహదారిపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి పది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సంక్షేమ సంఘం ప్రతినిధులు తనూజ, రమ పాల్గొన్నారు.

### ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

**తుమ్మపాల:** ఖైదీలు సత్ప్రవర్తనలో మెలగాలని ఇన్‌చార్జి జైల్ సూపరింటెండెంట్ చిటికెల కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సబ్‌జైలులో గురువారం సోషల్ ఇన్‌కుబేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జైలు జీవనం సాగిస్తున్న ఖైదీలుగా మనలాంటి వారేనని, వారు తెలియక చేసిన తప్పులకు కరాగారంలో గడుపుతున్నారని అన్నారు. ప్రస్తుతం ఖైదీల ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకు తాము చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జైలు సివిల్ ఉద్యోగి కె.లక్ష్మీనారాయణ, సామాజిక సేవా సంస్థల ప్రముఖులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మార్గశిర పూజలు



కశింకోటలో కనకమహాలక్ష్మికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు కృష్ణ

**కశింకోట:** కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయం గురువారం భక్తులతో కళకళలాడింది. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నియోజకవర్గంతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతల నుంచి భక్తులు ఎక్కువగా హాజరై దర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూల మాలలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి ఆలయ అర్చకుడు వి. కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



సచివాలయంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత



కోడూరు సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

**అనకాపల్లి:** రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యపడుతుందని ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. కోడూరు గ్రామ సచివాలయంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద అధ్యక్షతన గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో పీఏసీఎస్‌ల వద్ద రైతులు ఎరువులు, విత్తనాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో పడిగాపులు కాసేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు అందిస్తున్న జగన్‌కే దక్కిందన్నారు. అంతకుముందు సంక్షేమ పథకాల డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరించారు. అక్కడే పల్లెనిద్ర చేపట్టారు. ఎంపీడీవో నర్సింహారావు, ఎమ్మెల్వో మణీంద్ర, సర్పంచ్ సేనాపతి లక్ష్మి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పైడిరాజు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏఎంసీకాలనీ సచివాలయం-4లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జాజుల రమేష్ అధ్యక్షతన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరించారు. కాలనీ వాసులకు బ్రోచర్లు అందించి పార్టీ జెండా ఆవిష్కరించి రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వరాహావతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



**కశింకోట:** కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి గురువారం వరహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని వరహావతార రూపంలో అలంకరించి విష్ణు సహస్రనామార్చన చేశారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

### పంటకోత ప్రయోగాలే దిగుబడికి ప్రామాణికం

**సబ్బవరం:** పంటకోత ప్రయోగాలే పంట దిగుబడికి, పంటల బీమాకు ప్రామాణికమని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గేదెల రామారావు తెలిపారు.బాటజంగాలపాలెంలో గురువారం నిర్వహించిన వరి పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5/5 ప్లాట్‌లో కేవలం 5.750 కిలోల దిగుబడి మాత్రమే వచ్చినట్లు ఆయన చెప్పారు.

**IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM XIII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, AT ANAKAPALLE**

**I.A. 79/2023 in O.S. No 71/2023**

Between:
Jonnarapu Rajeswari and others .. Plaintiffs
And:
Sivakota Ashirvadam .. Defendant

**NOTICE**

To
Sivakota Ashirvadam
S/o Peda Appa Rao
D.No 9-171, Kothapeta Village
Gollapudi, East Godavari District.

Please take notice that the above suit which is filed against you for grant of permanent injunction, stands posted to **04-01-2024** for your appearance. If you have any objection you may attend either personally or through an advocate before the above said Court at **10.30 A.M.** on **04-01-2024** failing which the matter will be decided exparte in your absence.

(By order of the Commission)

Kandregula
Leela Hari Prasad, Advocate,
Gajuwaka, Visakhapatnam-26,
Cell: 81432 72790

Visakhapatnam,
Date: 22-12-2023